మన ప్రజా ప్రతినిధి
ప్రశ్నించడం కోసం...?
RNI NO. TELTEL/2023/90455
ప్రజా ప్రతినిధి NEWS టీ.వి
తెలుగు దినపత్రిక
ఎడిటర్: జి. శ్రీనివాస్ సంపటి : 3 సంచిక :241 బుధవారం జూన్ 24 2026, పేజీలు - 4 వేల : 2/-
epaper.manaprajaprathinidhi.com
PUBLISHED FROM: TELANGANA / ANDHRAPRADESH

# వర్షాలతో పాటు వ్యాధుల ముప్పు



- నిల్వ నీటిపై ప్రత్యేక నిఘా అవసరం
- స్వచ్ఛమైన తాగునీటితోనే ఆరోగ్య రక్షణ
- ముందస్తు జాగ్రత్తలే వ్యాధులకు చెక్

జూన్ 23 (మనప్రజాప్రతినిధి): రాష్ట్రంలో వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వర్షాకాలంలో దోమల ద్వారా, కలుషిత నీటి ద్వారా, వైరస్‌ల ద్వారా వ్యాపించే వ్యాధులు పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు ఆరోగ్య విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం అత్యంత ముఖ్యమని అధికారులు పేర్కొంటున్నారు. పాత టైర్లు, పూల కుండీలు, నీటి డబ్బాలు, కూలర్లు వంటి వాటిలో నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంటుంది. వారానికి ఒకసారి పరిసరాలను పరిశీలించి నిల్వ నీటిని తొలగించడం ద్వారా డెంగీ, మలేరియా వంటి వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించవచ్చని చెబుతున్నారు. తాగునీటి విషయంలో కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. వర్షాకాలంలో నీటి వనరులు కలుషితం అయ్యే అవకాశం ఉండటంతో నీటిని మరిగించి లేదా శుద్ధి చేసి తాగడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే బయట ఆహార పదార్థాలు, నిల్వ ఆహారాలను వీలైనంత వరకు తగ్గించి తాజాగా తయారు చేసిన ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలని సూచిస్తున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా జలుబు, దగ్గు, వైరల్ జ్వరాలు వచ్చే అవకాశం ఉంటుంది. అందువల్ల రోగనిరోధక శక్తిని పెంచే

2

# రైతుల ప్రయోజనాల కోసం... కేంద్రానికి ప్రతిపాదనలు



- వరి కొనుగోలు లక్ష్యం పెంచాలని ఉత్తమ్ విజ్ఞప్తి
- పామాయిల్ రైతులకు మేలు చేసే చర్యలు కోరిన తుమ్మల
- వ్యవసాయాభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక దృష్టి

2

# శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగరాలి



- కార్యకర్తలకు కేటీఆర్ దిశానిర్దేశం
- ఎమ్మెల్యే గాంధీపై విమర్శలు
- సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్‌పై చర్చ

2

# హైదరాబాద్ మెట్రో విస్తరణకు... కీలక ముందడుగు



- ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణపై కీలక నిర్ణయాలు
- ఎస్‌బీఐ క్యాప్స్‌కు సమగ్ర అధ్యయన బాధ్యతలు
- రెండు రోజుల చర్చలు విజయవంతమన్న సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగర భవిష్యత్ రవాణా వ్యవస్థకు అత్యంత కీలకంగా భావిస్తున్న మెట్రో రైలు ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణ అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య కీలక పురోగతి నమోదైంది. ఈ అంశాలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వరుసగా రెండు రోజుల పాటు కేంద్ర మంత్రులతో నిర్వహించిన చర్చలు ఫలప్రదమయ్యాయి. మెట్రో విస్తరణకు ఉన్న ఆర్థిక, పరిపాలనా అడ్డంకులను తొలగించే దిశగా పలు ముఖ్య నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. హైదరాబాద్ మెట్రో ఫేజ్-1ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడం, ఫేజ్-2 విస్తరణ పనులను వేగవంతం చేయడం, అందుకు అవసరమైన నిధుల

2

# సిట్ అదుపులో సీఐ నాగరాజు

- సాయికృష్ణ అదృశ్యం కేసులో కీలక పరిణామం
- విజయవాడలో ఉద్రిక్త పరిస్థితులు
- విచారణ కోసం కస్టడీలోకి తీసుకున్న అధికారులు



విజయవాడ, జూన్ 23 (మనప్రజా ప్రతినిధి): విజయవాడలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ అదృశ్యం కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన కృష్ణలంక సీఐ నాగరాజును ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో ఉన్న నాగరాజు నివాసానికి చేరుకున్న సిట్ అధికారులు విచారణ నిమిత్తం ఆయనను కస్టడీలోకి తీసుకున్నారు. అనంతరం మరింత విచారణ కోసం తమ కార్యాలయానికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు మద్దతుదారులు, అనుచరులు పెద్ద సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు చేరుకున్నారు. సిట్ అధికారులు నాగరాజును తరలించే సమయంలో కొందరు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో అక్కడ స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

2

# మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు



- రూ.34 వేల కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- 35 వేల ఉద్యోగాల కల్పనకు గ్రీన్ సిగ్నల్
- ఉద్యోగుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు

2

# వర్షాలతో పాటు వ్యాధుల ముప్పు

మెదటి పేజీ తరువాయి



ఆహార పదార్థాలను తీసుకోవడం, తగినంత నీరు తాగడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. జ్వరం లేదా ఇతర ఆరోగ్య సమస్యలు కనిపిస్తే స్వయంగా మందులు వాడకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లో స్థానిక సంస్థలు పారిశుద్ధ్య కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉంది. కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, దోమల నివారణ చర్యలు సకాలంలో అమలు చేస్తే సీజనల్ వ్యాధుల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రజలు కూడా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో భాగస్వాములు కావాలని కోరుతున్నారు. వర్షాకాలం ప్రకృతికి వరం అయినప్పటికీ ఆరోగ్య పరంగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం కూడా. చిన్నచిన్న ముందు జాగ్రత్తలు పాటించడం ద్వారా అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చు. వ్యక్తిగత పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు, పోషకాహారం, పరిసరాల శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తే వర్షాకాలాన్ని ఆరోగ్యంగా, ఆనందంగా గడపవచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు

# రైతుల ప్రయోజనాల కోసం... కేంద్రానికి ప్రతిపాదనలు

మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూన్ 23 (మనప్రజా ప్రతినిధి): తెలంగాణ రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పలు కీలక ప్రతిపాదనలు పంపింది. వరి కొనుగోళ్లు, పామాయిల్ సాగు, ఎరువుల సరఫరా తదితర అంశాలపై కేంద్ర మంత్రులకు రాష్ట్ర మంత్రులు లేఖలు రాశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తూ రబీ 2025-26 సీజన్‌కు సంబంధించిన వరి కొనుగోలు లక్ష్యాన్ని 35 లక్షల టన్నుల నుంచి 54.50 లక్షల టన్నులకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో పెరిగిన ధాన్య ఉత్పత్తిని దృష్టిలో ఉంచుకుని కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కేంద్ర పూలింగ్‌కు సంబంధించిన కస్టమ్ మిల్డ్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువులను 60 నుంచి 120 రోజుల వరకు పొడిగించాలని కోరారు. రైతులు, రైస్ మిల్లర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్ రైతుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. దేశీయ పామాయిల్ ఉత్పత్తికి ప్రోత్సాహం లభించేలా క్రూడ్ పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని 44 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణను దేశంలోనే ప్రధాన పామాయిల్ ఉత్పత్తి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 10 లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. పామాయిల్ రైతులకు కనీస మద్దతు ధర ప్రకారం కొనుగోలు హామీ కొనసాగించాలని కేంద్రాన్ని కోరారు. రైతులకు యూరియా ఎరువుల సరఫరా సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని, వ్యవసాయాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని తుమ్మల విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించిన అంశాన్ని కూడా కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ రంగ బలోపేతం, ప్రత్యామ్నాయ పంటల ప్రోత్సాహం లక్ష్యంగా ఈ ప్రతిపాదనలు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. రైతులకు మరింత మేలు జరిగేలా కేంద్రం సానుకూల నిర్ణయాలు తీసుకుంటుందని రాష్ట్ర ప్రభుత్వం ఆశాభావం వ్యక్తం చేసింది.

# శేరిలింగంపల్లిలో గులాబీ జెండా ఎగరాలి


మెదటి పేజీ తరువాయి



హైదరాబాద్, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): శేరిలింగంపల్లిలో మళ్లీ బీఆర్ఎస్ జెండా ఎగరాలంటే కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ తరఫున కార్యకర్తల కష్టంతో గెలిచిన ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో చేరారని కేటీఆర్ విమర్శించారు. గతంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి పనులపై స్వయంగా గాంధీ నివేదిక విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బీఆర్ఎస్ పాలనలో శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు ఖర్చు చేశామని పేర్కొన్న కేటీఆర్, గత రెండేళ్లలో నియోజకవర్గానికి ఎంత అభివృద్ధి తీసుకువచ్చారో ప్రస్తుత ఎమ్మెల్యే ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కూడా పార్టీ శ్రేణులు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై కూడా కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని, భవిష్యత్తులో బీఆర్ఎస్ మరింత బలోపేతంగా ముందుకు సాగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రో విస్తరణకు...కీలక ముందడుగు


మెదటి పేజీ తరువాయి



సమీకరణ, రుణాల సేకరణ వంటి అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. సోమవారం రాత్రి కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డితో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమావేశమయ్యారు. అనంతరం మంగళవారం ఉదయం కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ నివాసంలో మరో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మెట్రో ఫేజ్-1 ప్రస్తుత ఆస్తుల విలువ, నిర్వహణ వ్యయం, భవిష్యత్ ఆదాయ వనరులు, స్వాధీన ప్రక్రియకు అవసరమైన ఆర్థిక నమూనా, రుణ సంస్థల ఎంపిక వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అలాగే ఫేజ్-2 విస్తరణకు అవసరమైన పెట్టుబడులు, నిర్మాణ వ్యయం, కేంద్ర-రాష్ట్ర భాగస్వామ్యం, రుణ సౌకర్యాలు, ప్రాజెక్టు అమలు కాలపట్టిక వంటి అంశాలను కూడా సమీక్షించారు. మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి ప్రత్యేక కన్సల్టెంట్‌ను నియమించాలని కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రి ఏకాభిప్రాయానికి వచ్చారు. ఈ మేరకు ఎస్‌బీఐ క్యాప్స్‌ను కన్సల్టెంట్‌గా ఎంపిక చేశారు. ఈ సంస్థ మెట్రో ఫేజ్-1 విలువ నిర్ధారణ, స్వాధీన ప్రక్రియ, రుణ సేకరణ విధానం, ఆర్థిక సాధ్యాసాధ్యాలు, ఫేజ్-2 విస్తరణకు అవసరమైన నిధుల సమీకరణ వంటి అంశాలపై సమగ్ర నివేదిక రూపొందించనుంది. ఎస్‌బీఐ క్యాప్స్ నివేదిక ఆధారంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నారు. మెట్రో విస్తరణకు సంబంధించిన ఆర్థిక నమూనా, పెట్టుబడుల నిర్మాణం, రుణాల తిరిగి చెల్లింపు విధానం, ప్రభుత్వ భాగస్వామ్యం వంటి అంశాలపై కూడా సంస్థ సూచనలు ఇవ్వనుంది. దీంతో ప్రాజెక్టు అమలులో స్పష్టత రావడంతో పాటు నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఏర్పడనుంది. అధ్యయన ప్రక్రియ వేగంగా పూర్తయ్యేలా కేంద్ర ప్రభుత్వం తరఫున ఒక సీనియర్ అధికారి, రాష్ట్ర ప్రభుత్వం తరఫున పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక కార్యదర్శిని సమన్వయ అధికారులుగా నియమించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ఇద్దరు అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ కన్సల్టెంట్ అధ్యయనానికి అవసరమైన సమాచారాన్ని అందించడం, నివేదిక తయారీ ప్రక్రియను వేగవంతం చేయడం వంటి బాధ్యతలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ నగర విస్తరణ, పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణ అత్యంత అవసరమని సమావేశంలో అభిప్రాయపడినట్లు సమాచారం. ఫేజ్-2 ద్వారా నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో సేవలు విస్తరించనున్నాయి. దీంతో ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు ట్రాఫిక్ రద్దీ, కాలుష్యం తగ్గే అవకాశాలు ఉన్నాయి. మెట్రో విస్తరణ ప్రాజెక్టు తెలంగాణ ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య కార్యక్రమాల్లో ఒకటిగా కొనసాగుతోంది. కేంద్ర మంత్రులతో జరిగిన చర్చలు సానుకూలంగా ముగియడంతో ప్రాజెక్టు అమలుకు కొత్త ఊపు లభించిందని అధికారులు భావిస్తున్నారు. ఫేజ్-1 స్వాధీనం, ఫేజ్-2 విస్తరణకు సంబంధించిన ప్రక్రియలు పూర్తయితే హైదరాబాద్ మెట్రో దేశంలోనే అత్యంత విస్తృతమైన పట్టణ రవాణా వ్యవస్థల్లో ఒకటిగా మరింత అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# సిట్ అదుపులో సీఐ నాగరాజు


మెదటి పేజీ తరువాయి



పరిస్థితిని అదుపులో ఉంచేందుకు అదనపు పోలీసు బలగాలను కూడా మోహరించారు. ప్రస్తుతం నాగరాజు మద్దతుదారులు విజయవాడ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. గాదె సాయికృష్ణను మే 9న పోలీసు బృందం అదుపులోకి తీసుకెళ్లిన తర్వాత అతను కనిపించకుండా పోయాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కస్టడీలో జరిగిన పరిణామాల వల్లే సాయికృష్ణ మృతి చెందాడని, మృతదేహాన్ని మాయం చేశారని వారు ఆరోపణలు చేశారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారడంతో ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమించింది. దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలువురు అధికారులను విచారించిన సిట్, తాజాగా సీఐ నాగరాజును అదుపులోకి తీసుకుని కేసుకు సంబంధించిన వివరాలపై ఆరా తీస్తోంది. విచారణ కొనసాగుతోంది.

# అసెంబ్లీలో విజయ్ తొలి ప్రసంగం

చెన్నై, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): విజయ్ తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా తన తొలి ప్రసంగం చేస్తూ పలు కీలక అంశాలపై స్పందించారు. నీట్ పరీక్ష, త్రిభాషా సూత్రం, కరూర్ తొక్కిసలాట ఘటనతో పాటు రాజకీయ ప్రయాణంలో ఎదుర్కొన్న సవాళ్లను ప్రస్తావించారు. ఈ సందర్భంగా విమర్శకులకు గట్టిగా సమాధానం ఇచ్చారు. తమ పార్టీని ఒకప్పుడు “నటుడి పార్టీ“గా కొందరు ఎగతాళి చేశారని విజయ్ గుర్తుచేశారు. సినిమా రంగం నుంచి నేరుగా ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నానంటూ విమర్శలు చేసినా వాటిని పట్టించుకోలేదన్నారు. ప్రజల మధ్యకు వెళ్లి వారి విశ్వాసాన్ని సంపాదించిన తర్వాతే పార్టీని స్థాపించి ఎన్నికల్లో పోటీ చేశానని చెప్పారు. అధికారం తమకు సులభంగా రాలేదని, ప్రజల హృదయాలను గెలుచుకునేందుకు ఎన్నో సవాళ్లు, కుట్రలను ఎదుర్కొన్నామని విజయ్ పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకమే ఈ విజయానికి కారణమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పే అంతిమమని స్పష్టం చేశారు. నీట్ పరీక్ష వ్యవస్థపై స్పందిస్తూ, అది విద్యా అవకాశాల్లో అసమానతలను పెంచుతోందని ఆరోపించారు. సామాన్య, గ్రామీణ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ నీట్ విధానాన్ని రద్దు చేయాలని మరోసారి డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యా హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. త్రిభాషా సూత్రంపై కూడా విజయ్ తన వైఖరిని స్పష్టం చేశారు. తమిళనాడులో ద్విభాషా విధానాన్నే కొనసాగిస్తామని, హిందీ భాషను బలవంతంగా రుద్దే ప్రయత్నాలను అంగీకరించబోమని పేర్కొన్నారు. భాషా స్వేచ్ఛ, ప్రాంతీయ సంస్కృతి పరిరక్షణ తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని చెప్పారు. ఎన్నికల ప్రచార సమయంలో జరిగిన కరూర్ తొక్కిసలాట ఘటనను ప్రస్తావిస్తూ 41 మంది ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ ఘటనలో మరణించిన కుటుంబాల బాధను తాను ఎప్పటికీ మరిచిపోలేనని చెప్పారు. ఆ విషాద ఘటనకు కూడా తమపైనే నిందలు మోపడం బాధాకరమని వ్యాఖ్యానించారు. వారసత్వ రాజకీయాలపై పరోక్షంగా డీఎంకే ప్రభుత్వాన్ని విమర్శించిన విజయ్, ఒక కుటుంబం కోసం కాకుండా రాష్ట్రంలోని ప్రతి కుటుంబం కోసం పనిచేయడమే తమ రాజకీయ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, సమాన అభివృద్ధి, పారదర్శక పాలనతో ముందుకు సాగుతామని అసెంబ్లీ వేదికగా ప్రకటించారు.



# మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు

మెదటి పేజీ తరువాయి

అమరావతి, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. రాష్ట్ర అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన దాదాపు 80కి పైగా అజెండా అంశాలను మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్రంలో భారీ పెట్టుబడులను ప్రోత్సహించే దిశగా రూ.34 వేల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలకు మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పెట్టుబడుల ద్వారా సుమారు 35 వేల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం అంచనా వేస్తోంది. పారిశ్రామిక అభివృద్ధికి ఊతమిచ్చేలా ఈ నిర్ణయాలు దోహదపడనున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన కీలక నిర్ణయం కూడా సమావేశంలో తీసుకున్నారు. ప్రస్తుతం 60 సంవత్సరాలుగా ఉన్న పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచుతూ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీంతో వేలాది మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. రాజధాని ప్రాంతంతో పాటు వివిధ మౌలిక వసతుల అభివృద్ధికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. ఉండవల్లి ప్రాంతంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం రూ.426 కోట్ల నిధుల కేటాయింపుకు ఆమోదం లభించింది. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, ఇతర ప్రజా సౌకర్యాల కల్పనకు ఈ నిధులను వినియోగించనున్నారు. న్యాయవ్యవస్థ బలోపేతం కోసం జ్యుడీషియల్ అకాడమీ అభివృద్ధికి రూ.130 కోట్ల కేటాయింపును మంత్రివర్గం ఆమోదించింది. న్యాయమూర్తులు, న్యాయ అధికారుల శిక్షణ, ఆధునిక సదుపాయాల కల్పన కోసం ఈ నిధులు ఉపయోగించబడనున్నాయి. రాష్ట్ర ఆర్థికాభివృద్ధి, ఉపాధి అవకాశాల పెంపు, పరిపాలనా సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధికి దోహదపడే అనేక కీలక అంశాలపై మంత్రివర్గం నిర్ణయాలు తీసుకున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. ఈ నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధికి కొత్త దిశను చూపుతాయని అధికార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



## ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ విజయవంతం



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 23 జూన్ :మానకొండూరు నియోజకవర్గం లోని అన్ని పాఠశాలలు ఏబీవీపీ ఆధ్వర్యంలో బంద్ విజయవంతం జరిగిందని ఏబీవీపీ రాష్ట్ర నాయకులు అక్కెమ్ నాగరాజు తెలియజేశారు.ఈ సందర్బంగా అక్కెం నాగరాజు మాట్లాడుతూ 27,000 ల ప్రభుత్వ స్కూళ్లలో 23,000 ల స్కూళ్లను మూసి వేస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటనను వెంటనే ఉపసంహరించుకోవాలి అన్నారు.ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో విచ్చలవిడి ఫీజుల దోపిడిని అరికట్టి, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి అన్నారు.ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ళలో 25% సీట్లను పేద విద్యార్థులకు కేటాయించే విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.ఖాళీగా ఉన్న ఎంఈఓ ,డీఈవో పోస్టులతో పాటు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించే యూనిఫామ్స్ వెంటనే అందించాలి.గురుకుల పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించాలి.ఫుడ్ పాయిజన్ కి తావులేకుండా విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి.రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్ళలో "బ్రేక్ ఫాస్ట్" స్కీమ్ తక్షణమే అమలు చేయాలి.ప్రైవేట్ స్కూల్ మేనేజ్ మెంట్ల ఆధ్వర్యంలో నడుస్తున్న బుక్స్, యూనిఫామ్స్ విక్రయాలను నిషేధించాలి. ఈ కార్యక్రమం లో మంద వంశీ, పర్శరాములు, అజయ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

## భారత దేశ ఐక్యత సమగ్రత కోసం అంకితం చేసిన వ్యక్తి శ్యాం ప్రసాద్ ముఖర్జీ



మన ప్రజాప్రతినిధి/మనకొండూరు తేదీ 23 జూన్ :ఇల్లంతకుంట మండల కేంద్రంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివాస్ సందర్భంగా మండల కేంద్రంలో మండల అధ్యక్షులు భూమల్ల అనిల్ కుమార్ ఆధ్వర్యంలో శ్యామ ప్రసాద్ చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా భూమల్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ ఐక్యత, సమగ్రత కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప జాతీయవాది, విద్యావేత్త, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ బలిదానాన్ని దేశ ప్రజలందరూ స్మరించుకోవాలని తెలియజేశారు. స్వతంత్ర భారత రాజకీయాలకు సైద్ధాంతిక దిశను చూపించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ అని అన్నారు. జాతీయత, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం ఆయన చేసిన త్యాగాలు తరతరాలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. " ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, రెండు జెండాలు, రెండు ప్రధానులు ఉండరాదు" అనే ఆయన సిద్ధాంతం భారత ఐక్యతకు మార్గదర్శకంగా నిలిచిందన్నారు. శ్రీ శ్యామ ప్రసాద్ ముఖర్జీ దృఢ సంకల్పంతో జమ్మూ-కాశ్మీర్ సంపూర్ణ విలీనానికి ఆయన చేసిన పోరాటం భారత చరిత్రలో చిరస్మరణీయం. దేశ సమగ్రత, జాతీయ ఏకత్వం మరియు భారత మాత గౌరవం కోసం ఆయన చేసిన త్యాగం ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకం.1953 జూన్ 23న దేశ సమైక్యత కోసం పోరాడుతూ ఆయన చేసిన పరమ త్యాగం భారత జాతి ఎప్పటికీ మరువలేనిది. ఆయన ఆశయాలు, దేశభక్తి, సేవా తత్వం నేటి యువతకు మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి బలిదాన దివస్ సందర్భంగా వారికి శతకోటి వందనాలు. వారి త్యాగం, సేవలు ఎల్లప్పుడూ దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తాయని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు పండుగ లక్ష్మణ్, కూనవేణి బాలరాజ్, దూది సుధీర్ మండల మండల ప్రధాన కార్యదర్శులు పినికాసి అనిల్ , కరికే నవీన్ మండల కోశాధికారి పిల్లి గోపాల్ కార్యదర్శులు లంకోజు చంద్రం మండల కార్యవర్గ సభ్యులు తుమ్మనపల్లి కమలాకర్ రావు కూనవేణి పరుశరాం సీనియర్ నాయకులు దేశెట్టి శ్రీనివాస్ ,అమ్ముల అశోక్ నాయకులు కునవేణి రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వ్యాసరచన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేసిన టౌన్ ఏసీపీ



మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ఖమ్మం టౌన్ ఏసిపి కార్యాలయం(డ్రగ్స్) మహమ్మారి ఎందరో జీవితాలను చిన్నాభిన్నం చేస్తుందని ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి అన్నారు. మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం సందర్భంగా ఖమ్మం నగరంలోని ఇందిరానగర్ హైస్కూల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఖమ్మం టౌన్ ఏసీపీ బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..యువత మాదక దవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యంతో పాటు జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ కు అలవాటు పడినవారు విచక్షణ కోల్పోయి ఏం చేస్తున్నారో తెలియని పరిస్థితిల్లో అఘైత్యాలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ బాలకృష్ణ, స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత మత్తుకు బానిసలు కాకూడదని ముదిగొండ ఇన్స్పెక్టర్ మురళి అన్నారు




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:ముదిగొండ పోలీస్ స్టేషన్ ఖమ్మంపోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు డ్రగ్స్, గంజాయి వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు, అందులో భాగంగానే ముదిగొండ ప్రభుత్వ జూనియర్ కాలేజ్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించి, మాదక ద్రవ్యాల సరఫరా, వినియోగం ద్వారా ఆరోగ్య రీత్యా, చట్టరీత్యా ఎదురయ్యే సమస్యల పై యువతకు అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సమాజ భవిష్యత్తని వారు సరైన మార్గంలో నడిస్తేనే దేశ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలన ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి పాఠశాల, ప్రతి కుటుంబం నుండి ప్రారంభం కావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై హరిత, ఏఎస్సై ఖలీక్ పాల్గొన్నారు.

## భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని... మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా :వి యం బంజర పోలీస్ స్టేషన్ ఖమ్మంఎస్సై వెంకటేష్ యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తి గత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వియం బంజారా ఎస్సై వెంకటేష్ అన్నారు.పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు వియం బంజారా పోలీసుల ఆధ్వర్యంలో కుప్పెనకుంట్ల లోని టిజీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ /జేసి లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్ర మత్తం చేయాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కట్టుబడి ఉన్నారని, మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పప రిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

## జర్నలిస్ట్ పై దాడి అమానుషం నిందితులను వెంటనే అరెస్ట్ చెయ్యాలి




మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 23:ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులకు, గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసిన వార్త రాసిన, మన తెలంగాణ నార్సింగి విలేకరి రాఘవేంద్రపై సోమవారం నాడు జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చేగుంట ప్రెస్ క్లబ్ సభ్యులు తెలిపారు,ఈ విషయమై మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో యూనియన్ నాయకులతో కలిసి పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పత్రికా స్వేచ్ఛను హరిస్తూ నిజాలు నిగ్గు తేల్చిన జర్నలిస్టులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులపై పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమం లో అయిత రఘురాములు, కాషాబోయిన సుధాకర్, చిట్టబోయిన రఘుపతి, వేరేషం, దుర్గని మురళి,తదితరులు ఉన్నారు.

## కాలుష్యంపై భగ్గుమన్న గ్రామస్తులు... బ్లూక్రాన్ కంపెనీ ముందు ధర్నా



సదాశివపేట మండల్ రిపోర్టర్ జూన్ 23 (మన ప్రజాప్రతినిధి ):సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నంది కంది గ్రామ సమీపంలో ని బ్లూక్రాన్ ఆగ్రో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపిస్తూ గ్రామ సర్పంచ్ మాచర్ల సరస్వతి విజయ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు కంపెనీ ముందు ధర్నా నిర్వహించారు గత కొన్ని రోజులుగా రాత్రి వేళలో కంపెనీ నుంచి వెలువడుతున్న పొగ కారణంగా గ్రామంలోని ఇళ్లపై బూడిద పేరుకుపోతుండటం తో పాటు దుర్వాసన ప్రభావం చెపుతుందని ఆవేదం వ్యక్తం చేశారు తాగునీరు ఆహార పదార్థాలు కూడా కలుషితమవుతున్నాయని కంపెనీ విడుదల చేస్తున్న వ్యర్థ జలాలు భూగర్భ జలాలు సైతం ప్రభావిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపించారు ఈ సమస్యపై ఇప్పటికీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు రాలేదని కంపెనీపై జారీ చేసిన క్లోజింగ్ ఆర్డర్లను కూడా పట్టించుకోకుండా యథావిదగా కార్యకలాపాలు కొనసాగిస్తుందని పేర్కొన్నారు ప్రజల ఆరోగ్యం పర్యావరణ భద్రతను దృష్టిలో తీసుకొని సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకొని కంపెనీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ధర్నా సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకోనగా సదాశివపేట సిఐ వెంకటేశం జోక్యం చేసుకొని గ్రామస్తులతో మాట్లాడి పరిస్థితిని శాంతింపచేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆకుల శివరాం వార్డ్ సభ్యులు గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు

## బిజెపి ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు



మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 23:మాసాయిపేట మండల బీజేపీ అధ్యక్షులు మోలుగు నాగేందర్ రెడ్డి ఆధ్వర్యంలో జనసంఘ్ వ్యవస్థాపకులు, డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ముందుగా వారి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో పోతంశెట్టిపల్లి సర్పంచ్ ప్రశాంత్ , మండల బీజేపీ ప్రధాన కార్యదర్శులు నవీన్ యాదవ్, రవికిరణ్ గౌడ్ , మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు వాదనాల నాగేష్ , బూత్ అధ్యక్షులు గౌరగాళ్ల రాములు , కార్యదర్శి ముక్క యాదగిరి , శక్తి కేంద్ర ఇంచార్జిలు రాము నాయక్, శ్రీను నాయక్ , స్వామి సినియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుద్దేడ,మర్పడగ రైతు వేదికలలో విత్తనల మేళ

మనప్రజాప్రతినిధి కొండపాక మండల్: దుద్దెడ, మర్పడగ రైతు వేదికలలో మంగళవారం రోజు విత్తన మేళ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ విరూపాక శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలొ దుద్దెడ రైతు వేదికలో ఈ విత్తన మేళ ప్రారంభించారు.ఈ మేళా లో ప్రభుత్వం ప్రతిపాదించిన ఏడు రకాల సన్న వరి రకాలు, కంది, పెసర,కూరగాయ పంటల విత్తనాలు, నానో యూరియా, నానో డి ఎ పి లు రైతులకు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు.అదే విధంగా రైతులకు ఎలినినో ప్రభావం వర్షాభావ



పరిస్థితుల గూర్చి రైతులకు వివరించామన్నారు.ఎల్ నినో పోస్టర్లు కూడా ఎ ఎమ్ సి ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి చేతుల మీద ఆవిష్కరించటం జరిగింది. ఎలినినో ప్రభావం వలన రైతులు తక్కువ కాల పరిమితి ఉన్న పంటలకు సంబంధించిన విత్తనాలు కూడా విత్తన మేళ లో రైతులకు అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు సుష్మిత , సాత్విక ,రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలకు స్మార్ట్ టీవీ బహుకరణ

మన ప్రజప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా చేగుంట జూన్ 23:జి ఎం అర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మసాయిపేట్ మండల పరిదిలోని వెనుక తండా లో మంగళవారం ప్రభుత్వ పాఠశాల లోని విద్యార్థులకు స్మార్ట్ తరగతులు నిర్వహించడానికి ఉపయోగపడేలా 43 ఇంచ్ స్మార్ట్ టీవీని జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, రక్ష అసోసియేషన్ ఏ ఎస్ ఓ చరణ్, మండల విద్యాధికారి మధుసూదన్, చేతుల మీదుగా పాఠశాల కు ఇవ్వడం జరిగింది,ఈ కార్యక్రమంలో జి.యం.ఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్,




రక్ష ఏ ఎస్ ఓ చరణ్, మండల విద్యాధికారి మధుసూదన్, పాఠశాల ఉపాధ్యాయ బృందం కనకయ్య, జ్యోతి, గ్రామ సర్పంచ్ రాములు వార్డ్ మెంబర్ సురేష్, ఏఎపిసి చైర్మన్ మంజుల, పాల్గొన్నారు.

## పాత కక్షల ప్రతీకారం.. ఇద్దరు బలి

మన ప్రజా ప్రతినిధి తెలుగు దిన పత్రిక మెదక్ జిల్లా శంకరంపేట్ /చేగుంట జూన్ 23:చిన్న శంకరంపేట్ మండల పరిదిలోని సూరారం గ్రామంలో జంట హత్యలతో గ్రామం లో తీవ్ర ఉద్రిక్తత.. పోలీసుల ఆధీనంలో గ్రామంమెదక్ జిల్లా చిన్నశంకరంపేట్ మండలం సూరారం గ్రామంలో పాత కక్షలు ఇద్దరి ప్రాణాలను బలిగొన్న విషాద ఘటన చోటుచేసుకుంది. ఒకరి హత్యకు ప్రతీకారంగా మరో హత్య జరగడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



పరిస్థితి అదుపు తప్పకుండా పోలీసులు గ్రామం లో భారీగా బలగాలను మోహరించి గ్రామాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నారు.స్థానికుల కథనం ప్రకారం, సూరారం గ్రామానికి చెందిన లియాట శ్రీధర్ (25)ను అదే గ్రామానికి చెందిన రనబోయిన ప్రభాకర్ సోమవారం రోజు చేగుంట మండలం అన్నంతసాగర్ గ్రామం లో ఆటోతో ఢీకొట్టి హత్య జరిగింది, ఈ ఘటన పాత కక్షల నేపథ్యంలో జరిగినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. శ్రీధర్ మృతితో గ్రామంలో తీవ్ర ఆందోళన నెలకొంది.అయితే ఈ ఘటన జరిగిన కొద్ది గంటల్లోనే ప్రతీకార దాడి చోటుచేసుకుంది. శ్రీధర్ కుటుంబ సభ్యులుగా పేర్కొంటున్న యాట లక్ష్మణ్, దిడ్డికాడి లింగం, యాట కిషన్లు ప్రభాకర్ తండ్రి లిలిరనబోయిన యదగిరి (60)లిని వెంబడించి పట్టుకుని బండరాయితో దారుణంగా హత్య చేసి, అనంతరం మృతదేహాన్ని మాసాయిపేట మండలం కొప్పులపల్లి సమీపంలోని హల్దీ ప్రాజెక్టు ప్రాంతంలో పడేసినారు . ఒకేరోజు జరిగిన ఈ రెండు హత్యలతో సూరారం గ్రామంలో భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ శాంతిభద్రతలు కాపాడేందుకు చర్యలు చేపట్టారు. రెండు ఘటనలపై పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హత్యలకు దారితీసిన అసలు కారణాలు, ఘటనల క్రమం, ఇందులో పాల్గొన్న వారి పాత్రపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. నిందితులను అదుపులోకి తీసుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టినారు . ఈ వరుస హత్యలు మెదక్ జిల్లాలో కలకలం రేపగా, గ్రామంలో ఉద్రిక్తత కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు ప్రజలు శాంతిని పాటించాలని, ఎలాంటి వదంతులను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాదకద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు

మన ప్రజా ప్రతినిధి తెలుగు దినపత్రిక ఖమ్మం జిల్లా:పోలీస్ కమిషనర్ కార్యాలయం ఖమ్మంయువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటి వినియోగం వ్యక్తి గత జీవితంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్న పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు... విద్యార్థులు తమ



భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండడంతో పాటు ఇతరులను కూడా అప్ర మత్తం చేయాలని సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై ప్రజలు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పప రిణామాలపై విద్యార్థులు, ప్రజలకు కూడా విస్తృతంగా అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

## నూతన ఎస్సై కి సన్మానం కొమ్ము విజయ్

మన ప్రజా ప్రతినిధి కొండపాక :కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్ కి నూతనంగా సబ్ ఇన్స్పెక్టర్ గా పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మంగళవారం వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఎస్సై బాలకిషన్ కు శాలువాతో సత్కరించి మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ స్టేట్ వైస్ చైర్మన్ కొమ్ము విజయకుమార్, అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలనలో శాంతి భద్రతలకు ఎలాంటి లోటు లేకుండా పాలన కొనసాగుతుందని అలాగే పోలీస్




స్టేషన్ పరిధిలో కూడా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని ఎస్సైని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని, శాంతి భద్రతలకు అందరూ సహకరించాలని,మద్యం సేవించి వాహనాలు నడపకూడదు, ఆన్లైన్ సైబర్ మోసగాళ్ల వాళ్లలో పడకూడదని ఎవరైనా అనమాస్పందంగా ఊర్లలోకి వస్తే మాకు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ రవీందర్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు ఏర్పుల మల్లేశం, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు, బ్రహ్మం, బండమీది తిరుపతి తో తదితరులు ఉన్నారు.

## హల్ది ఫంక్షన్లో పాల్గొన్న వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్..

మనప్రజాప్రతినిధి//వరంగల్ జూన్ 23:ఈరోజు చార్ బౌలి ప్రాంతానికి చెందిన ముత్యాల రవికుమార్ కుమారుడు" చి"పవన్ దత్త హల్ది ఫంక్షన్లో పాల్గొని ఆశీర్వదించిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి. ఆయనతో పాటు నాగవెల్లి సుమన్, విటల్ రావు, నరేష్, శరత్, కుమార్, ప్రవీణ్, శివ, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు వేదికలలో విత్తన మేళా

మనప్రజాప్రతినిధి//కోహిర :తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచే లక్ష్యంతో 23-06-2026 నుండి 30-06-2026 వరకు రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికలలో విత్తన మేళాలు నిర్వహించ బడుతున్నాయి. దీనిలో భాగంగానే ఈ రోజు కోహిర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో విత్తన మేళా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి గారు, స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ




వ్యవసాయ ఉత్పాదకత పెంపు, నాణ్యమైన విత్తనాల వినియోగాన్ని ప్రోత్సహించడం మరియు రైతులకు అవసరమైన వ్యవసాయ సమాచారాన్ని అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ విత్తన మేళాలలో రైతులకు పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయల విత్తనాలు తదితర పంటలకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచబడుతున్నాయి అని తెలిపారు. అలాగే పంటల సాగుకు సంబంధించిన సాంకేతిక సూచనలు, ఎరువుల వినియోగం, పురుగు మరియు వ్యాధుల నివారణ చర్యలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తారు అని తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి గారు మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ (చీఖీాచీవీ) పథకం కింద రైతులు పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచి అధిక దిగుబడులు సాధించేందుకు, ప్రస్తుత వ్యవసాయ సంవత్సరంలో రైతులకు ఉచితంగా మినీకిట్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ పథకం కింద 4475 ఎకరాలకు కంది విత్తనాలు, 240 ఎకరాలకు పెసర, 700 ఎకరాలకు మినుము విత్తనాలు జహీరాబాద్ డివిజన్ కి కేటాయించడం జరిగింది అని తెలిపారు.అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్నేహలత మాట్లాడుతూ వివిధ రకాల పంటలలో చేపట్టవలసిన యాజమాన్య పద్దతులను రైతులకు వివరించడం జరిగింది.అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి గారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది అని తెలిపారు. రైతులు సందేహాల కొరకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలని కోరారు.అనంతరం మినికిట్లను రైతులకు అందజేయడం జరిగింది.

## బ్రహ్మకుమారి నూతన సెంటర్ కోసం రూ.1 లక్ష విరాళం

మనప్రజాప్రతినిధి//కోహిర్:కోహిర్ మండలంలో నూతనంగా నిర్మించ బడుతున్న బ్రహ్మకుమారి భవనం నిర్మాణానికి పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సామాజిక సేవకుడు రాగులపల్లి నర్సిములు యాదవ్ తన వంతు సహాయంగా రూ.1,00,000 (ఒక లక్ష రూపాయలు) విరాళంగా అందజేశారు.ఈ సందర్భంగా బ్రహ్మకుమారి సెంటర్ సభ్యులు, భక్తులు మరియు కమిటీ సభ్యులు నర్సిములు యాదవ్ గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సంతోషం



వ్యక్తం చేశారు. సమాజ సేవా కార్యక్రమాలకు ఆయన అందిస్తున్న సహకారం ఆదర్శప్రాయమని కొనియాడారు.


# అధ్వానంగా మారిన పోతిరెడ్డిపల్లి రోడ్డు



ప్రజాప్రతినిధి న్యూస్//కోహిర్: కోహిర్ మండలంలోని పోతిరెడ్డిపల్లి కోహిర్ ప్రధాన రహదారి అధ్వానంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో రాకపోకలు మరింత కష్టంగా మారాయి .ప్రతిరోజూ ఈ మార్గంలో ప్రయాణించే గ్రామస్థులు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధులకు సమస్యను వివరించినప్పటికీ ఇప్పటివరకు రోడ్డు మరమ్మతులు చేపట్టలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు వెంటనే స్పందించి పోతిరెడ్డిపల్లి కోహిర్ రహదారిని మరమ్మతు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు

# సీసీ రోడ్ల పనులను ప్రారంభించిన...

## దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి



మనప్రజాప్రతినిధి//దుబ్బాక: దుబ్బాక నియోజకవర్గం తొగుట మండలం లోని వెంకట్రావుపేట గ్రామంలో CRR 20 లక్షల రూపాయలు తొగుట గ్రామంలో CRR 10 లక్షల రూపాయలు MGNREGS 5 లక్షల రూపాయలు కాన్గల్ గ్రామంలో CRR 10 లక్షల MGNREGS 5 లక్షల రూపాయల నిధులతో మంజూరైన 50 లక్షల రూపాయల సీసీ రోడ్డు పనులను దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి గారు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి రోడ్డు లేని పల్లెలుగా తీర్చిదిద్దడమే మా కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ గాంధారి నరేందర్ రెడ్డి,-ావీజ మార్కెట్ కమిటీ చైర్మన్ చెరుకు విజయ్ రెడ్డి ( అమర్) ,సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పిట్ల సత్తయ్య,సర్పంచ్లు బండారు కవిత,పాగల శోభా, రాంపురం రమేష్,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు జీడిపల్లి స్వామి, పిట్ల బిక్షపతిఆత్మ కమిటీ డైరెక్టర్ బెజ్జనబోయిన ప్రవీణ్,ఉప సర్పంచ్ బండారు తిరుపతి,గ్రామ పార్టీ అధ్యక్షులు బండారు రమేష్ గౌడ్, బషీర్,సీనియర్ నాయకులు భూపాల్ రెడ్డి,పంది రాజు,మల్లారెడ్డి,కొండల్ రెడ్డి,నిరంజన్ రెడ్డి,ఇందిరమ్మ కమిటీ సభ్యులు వడ్డే కిష్టయ్య, చరణ్,షఫీ, వార్డ్ సభ్యులు భాను,నాయకులు పోతరాజు రవీందర్,నర్సింలు,అర్జున్,భాస్కర్,ప్రశాంత్,తదితరాలు పాల్గొన్నారు.

# ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు

**- నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌పై ఏసీబీ కేసు**
**- రూ.3 కోట్లకు పైగా ఆస్తులు గుర్తింపు**
**- 10 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించిన అధికారులు**



నిజామాబాద్, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): నిజామాబాద్ జిల్లా నిషేధం, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ కొమ్మూరి మల్లారెడ్డిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నమోదు చేసింది. విధి నిర్వహణ సమయంలో అవినీతి పద్ధతులు, అక్రమ మార్గాల ద్వారా తెలిసిన ఆదాయ వనరులకు మించి ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.అవినీతి నిరోధక చట్టంలోని నిబంధనల మేరకు మంగళవారం మల్లారెడ్డి నివాసంతో పాటు ఆయన బంధువులు, బినామీలు, సన్నిహితులకు సంబంధించిన మొత్తం 10 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీ స్థాయిలో స్థిర, చర ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. సోదాల సందర్భంగా నాలుగు నివాస గృహాలు, ఒక వాణిజ్య భవనం, ఎనిమిది ఖాళీ స్థలాలు, 10.23 ఎకరాల వ్యవసాయ భూమిని అధికారులు గుర్తించారు. వీటితో పాటు నగదు, బ్యాంకు నిల్వలు, వాహనాలు కూడా ఉన్నట్లు ఏసీబీ వెల్లడించింది. పత్రాల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.3 కోట్లుగా అంచనా వేస్తుండగా, మార్కెట్ విలువ మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.అదనంగా సుమారు రూ.3.31 లక్షల నగదు, రూ.50 లక్షల బ్యాంకు నిల్వలు, ఒక విలాసవంతమైన కారు, ఒక ద్విచక్ర వాహనాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మల్లారెడ్డి భార్య, కుటుంబ సభ్యుల పేర్లపై ఉన్న మూడు బ్యాంకు లాకర్లను కూడా గుర్తించినట్లు తెలిపారు. విచారణలో భాగంగా వాటిని త్వరలో తెరిచి పరిశీలించనున్నారు.సోదాల సమయంలో బయటపడిన ఆస్తులపై పూర్తి స్థాయి ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు. మరిన్ని ఆస్తులు, పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలపై కూడా విచారణ జరుగుతోందని పేర్కొన్నారు. ఈ కేసులో మరింత సమాచారం సేకరించేందుకు సంబంధిత పత్రాలను పరిశీలిస్తున్నారు. కేసులో నిందితుడిగా ఉన్న కొమ్మూరి మల్లారెడ్డిని నాంపల్లి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచి న్యాయస్థాన రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. దర్యాప్తు కొనసాగుతోందని, విచారణలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఏసీబీ స్పష్టం చేసింది.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఎస్సై

**- రూ. లక్ష డిమాండ్.. రూ.50 వేలు స్వీకరిస్తుండగా పట్టివేత**
**- గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో అవినీతి వ్యవహారం బట్టబయలు**
**- హైదరాబాద్‌లో ఏసీబీ ఉచ్చులో పోలీసు అధికారి**







హైదరాబాద్, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): విధి నిర్వహణలో నిజాయితీగా ఉండాల్సిన ఓ పోలీసు అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు. హైదరాబాద్‌లోని గాంధీనగర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్సై వి. నర్సింహులు ఓ వ్యక్తి నుంచి లంచం డిమాండ్ చేసి, అందులో భాగంగా రూ.50 వేల నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ వర్గాల సమాచారం ప్రకారం, ఓ కేసుకు సంబంధించిన వ్యవహారంలో సహకరించేందుకు ఎస్సై నర్సింహులు మొత్తం రూ.1 లక్ష లంచం కోరినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలించిన అధికారులు పక్కా ప్రణాళికతో ఉచ్చు అమర్చి నిందితుడిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం బాధితుడు ఎస్సైకు లంచం అందజేస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి అతడిని అదుపులోకి తీసుకున్నారు. రూ.1 లక్షలో భాగంగా రూ.50 వేల నగదును స్వీకరిస్తున్న సమయంలోనే అధికారులు పట్టుకోవడంతో అవినీతి వ్యవహారం బట్టబయలైంది. అనంతరం నిర్వహించిన రసాయన పరీక్షల్లో కూడా లంచం స్వీకరించినట్లు నిర్ధారణ అయినట్లు తెలిసింది. ఈ ఘటన పోలీసు శాఖలో కలకలం రేపింది. ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన అధికారులే అవినీతికి పాల్పడడం ఆందోళన కలిగించే అంశమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు అవినీతి నిరోధక సంస్థలు చేపడుతున్న చర్యలకు ఈ ఘటన మరో ఉదాహరణగా నిలిచింది.పట్టుబడిన ఎస్సైపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. లంచం డిమాండ్ చేసిన పరిస్థితులు, కేసుకు సంబంధించిన ఇతర అంశాలపై కూడా విచారణ జరుపుతున్నట్లు సమాచారం. అవసరమైతే మరికొందరి పాత్రపై కూడా దర్యాప్తు చేపట్టే అవకాశముందని తెలుస్తోంది. అవినీతి డిమాండ్లను ఎదుర్కొంటున్న ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు డిమాండ్ చేస్తే సహించవద్దని, వెంటనే సమాచారం అందిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేస్తున్నారు. రాష్ట్రంలో అవినీతిని అరికట్టేందుకు తనిఖీలు, ఉచ్చులు, ప్రత్యేక దాడులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.

# లక్ష ఇళ్ల పథకానికి ప్రజల నుంచి పేర్ల ఆహ్వానం

**- ఉత్తమ పేరుకు రూ. లక్ష బహుమతి**
**- హైదరాబాద్‌లో భారీ గృహ నిర్మాణ ప్రణాళిక**
**- జూన్ 28 వరకు సూచనలు పంపే అవకాశం**

హైదరాబాద్, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): హైదరాబాద్ నగరంలో ప్రతిపాదిత లక్ష ఇళ్ల భారీ గృహ నిర్మాణ పథకానికి ఆకర్షణీయమైన పేరును సూచించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రజలను ఆహ్వానించింది. ఈ పథకానికి అత్యుత్తమ పేరును ఎంపిక చేసి సూచించిన వ్యక్తికి తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ (టీజీహెచ్‌బీ) రూ. లక్ష నగదు బహుమతిని ప్రకటించింది.ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) ప్రాంతంలో లక్ష ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్ఠాత్మక పథకాన్ని రూపొందిస్తోంది. నగరాభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలిచే ఈ ప్రాజెక్టుకు ప్రజల భాగస్వామ్యంతో పేరు నిర్ణయించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ గౌతమ్ వివరాలు వెల్లడించారు. ప్రజల ఆలోచనలు, సూచనలకు ప్రాధాన్యత ఇస్తూ పేర్ల ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల భాగస్వామ్యం ద్వారా ఈ పథకానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలన్నదే లక్ష్యమని పేర్కొన్నారు.ఆసక్తి గల పౌరులు తమ పేర్ల సూచనలను టీజీహెచ్‌బీ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా పంపవచ్చని అధికారులు తెలిపారు. సృజనాత్మకత, తెలంగాణ సంస్కృతి, అభివృద్ధి భావనలను ప్రతిబింబించే పేర్లకు ప్రాధాన్యత ఉండే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పేర్లను సమర్పించేందుకు ఈ నెల 28వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అందిన సూచనల్లో నుంచి ఉత్తమమైన పేరును ఎంపిక చేసి విజేతను ప్రకటించనున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో పెరుగుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిస్తున్న ఈ లక్ష ఇళ్ల పథకం ద్వారా మధ్యతరగతి, సామాన్య ప్రజలకు అందుబాటు ధరల్లో నివాస సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ప్రజల నుంచి విస్తృత స్పందన లభిస్తుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి వర్గాన్నీ మోసం చేసింది హరీష్ రావు

**- అశ్వారావుపేట బీఆర్ఎస్ సమావేశంలో ప్రభుత్వంపై విమర్శలు**
**- కేసీఆర్ పాలనను గుర్తు చేసిన మాజీ మంత్రి**
**- రైతులు, గిరిజనులు, దళితులకు**



భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 23 (మనప్రజాప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులు, గిరిజనులు, దళితులు, బలహీన వర్గాలతో సహా ప్రతి వర్గాన్నీ మోసం చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు.ప్రజల్లో ఇప్పటికీ కేసీఆర్ నాయకత్వంపై విశ్వాసం ఉందని హరీష్ రావు పేర్కొన్నారు. అచ్చంపేట నుంచి అశ్వారావుపేట వరకు ఎక్కడికి వెళ్లినా మళ్లీ కేసీఆరే రావాలనే అభిప్రాయం వినిపిస్తోందన్నారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజల అవసరాలను గుర్తించి కళ్యాణలక్ష్మి, రైతుబంధు, రైతు బీమా, కేసీఆర్ కిట్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు పూర్తి స్థాయిలో రుణమాఫీ జరగలేదని, రైతుబంధు పథకాన్ని నిలిపివేశారని ఆరోపించారు. గతంలో పంటలు దెబ్బతింటే ఎకరాకు పరిహారం ఇస్తామని ప్రకటించినా ఇప్పటికీ రైతులకు నష్టపరిహారం అందలేదని అన్నారు.గిరిజనులు, దళితుల సంక్షేమానికి సంబంధించిన నిధులను ప్రభుత్వం విడుదల చేయలేదని హరీష్ రావు పేర్కొన్నారు. ఎస్టీ, ఎస్సీ కార్పొరేషన్లకు బడ్జెట్‌లో వేల కోట్లు కేటాయించినట్లు ప్రకటించినప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. గిరిజన విద్యార్థులకు, యువతకు గతంలో అందించిన అవకాశాలు ఇప్పుడు కనిపించడం లేదన్నారు.ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల్లో ఆశించిన పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు పనులు నెమ్మదిగా సాగుతున్నాయని, అశ్వారావుపేటలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని పేర్కొన్నారు. జిల్లాకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో పోలీసుల వ్యవహార శైలిపై కూడా హరీష్ రావు విమర్శలు గుప్పించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఇబ్బంది పెట్టే చర్యలను పార్టీ గమనిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం సరికాదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై మరింత బలంగా పోరాడుతామని, ప్రజల మద్దతుతో బీఆర్ఎస్ మళ్లీ బలంగా ముందుకు వస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.